ప్రజాశక్తి
బుధవారం 15 మార్చి 2023


అల్లూరి సీతారామరాజు

ఒంటిపూట బడులు నిర్వహించాలి

- యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మహేశ్వరరావు

ప్రజాశక్తి -డుంబ్రిగూడ: రాష్ట్రంలో ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ఈ నెల 15 నుంచి ఒంటిపూట బడులు నిర్వహించాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి మహేశ్వరరావు డిమాండ్ చేశారు. ఏటా మార్చి 15 నుంచి ఒంటిపూట బడులు నిర్వహించడం సంప్రదాయబద్ధంగా గత అర్ధ శతాబ్ద కాలంగా కొనసాగుతోందన్నారు. విద్యార్థుల ఆరోగ్యం, శ్రేయస్సును పరిగణనలోకి తీసుకొని, విద్యాలయాల్లో ఒంటిపూడ బడుల నిర్వహణపై ప్రభుత్వం తక్షణమే నిర్ణయం తీసుకుని ప్రకటించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కౌన్సిలర్లు ఎస్.కన్నయ్య, కె.రఘునాథ్, స్థానిక మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎల్ నారాయణ, ఎస్ బాలకృష్ణ, జి దుక్కు, ఆనంద్, మోహన్, మేఘనాథ్ పాల్గొన్నారు.

నిమిషం ఆలస్యమైనా వెనక్కే..!

- ఇంటర్ పరీక్షల్లోనూ జెఇఇ నిబంధన
- నేటి నుంచి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం
- పాడేరు డివిజన్‌లో 16 కేంద్రాలు
- పరీక్షలు రాయనున్న 8492 మంది
- కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు


పాడేరులోని ఇంటర్ పరీక్ష కేంద్రం

నేటి నుంచే ఇంటర్ పరీక్షలు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఈనెల 15 నుంచి వచ్చేనెల 4వ తేదీ వరకు నిర్వహించనున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు అల్లూరి జిల్లా పాడేరు డివిజన్‌లోని 11 మండలాల్లో అధికారులు ఏర్పాటు చేశారు. 15న బుధవారం ఇంటర్ ఫస్టియర్ పరీక్షతో ప్రారంభమె, ప్రతిరోజూ ఉదయం 9గంటల నుంచి 12గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారు. ఇంటర్ పరీక్షలకు కూడా జెఇఇ తరహాలో ఒక్క నిమిషం ఆలస్యమైనా కేంద్రంలోకి విద్యార్థులను అనుమతించకూడదని ఇంటర్మీడియట్ బోర్డు నుంచి ఇప్పటికే ఆదేశాలు అందాయి. గతంలో ఒక నిమిషం ఆలస్యమైతే అనుమతించేవారు. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి నిమిషం నిబంధన కచ్చితంగా అమలు చేస్తున్నారు. దీని దష్టిలో పెట్టుకుని కచ్చితంగా విద్యార్థులు నిర్దేశిత సమయంలోపే కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.. పరీక్ష పూర్తిగా ముగిసిన తర్వాతనే విద్యార్థులను బయటకు పంపిస్తారు.

పాడేరు డివిజన్ 11 మండలాల్లో 16 కేంద్రాల్లో పరీక్షల నిర్వహణకు ఇంటర్ బోర్డు యంత్రాంగం ఏర్పాటు చేసింది. మంగళవారం సాయంత్రానికి పరీక్ష కేంద్రాల్లో హాల్ టికెట్ నంబర్లతో సహా బల్లలు, బెంచీలపై రాశారు. జనరల్, ఒకేషనల్ కలిపి ఫస్టియర్‌లో 4393, సెకెండియర్‌లో 4100, మొత్తం 8492 మంది విద్యార్థులు హాజరుకానున్నారు.

పరీక్షలుపగడ్బందీగా నిర్వహిం చేందుకు ప్రతి కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ అధికారి, సరిపడా ఇన్విలిలేటర్లను ఇప్పటికే నియమించారు. కస్టోడియన్‌లు, ఫ్లయింగ్ స్క్వాడ్లు, సిట్టింగ్ స్క్వాడ్లు ఉంటాయి. వీరితోపాటు జిల్లా కలెక్టర్, ఐటిడిఎ పిఒ, ఆర్ఐఒ, డిఇఒ, రెవెన్యూ అధికారులు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేస్తారు. కలెక్టర్ ఆదేశాల మేరకు 144 సెక్షన్ అమలులో ఉంటుంది. పరీక్షవేళల్లో కేంద్రానికి సమీపంలోని జిరాక్స్, కంప్యూటర్ కేంద్రాలు మూసివేయిస్తారు.పరీక్ష రోజుల్లో నిరంతర విద్యుత్ సరఫరా, కేంద్రాల్లో తాగునీరు, వైద్యశిబిరం, పోలీస్ బందోబస్తుతోపాటు సకాలంలో విద్యార్థులను పరీక్ష కేంద్రాలకు తరలించే వీలుగా బస్‌సౌకర్యం కల్పించేలా సంబంధిత అధికారులకు ఇప్పటికే కలెక్టర్ ఆదేశాలిచ్చారు.

11 మండలాల్లో 16 పరీక్ష కేంద్రాలు ఇవే..

పాడేరు డివిజన్ పరిధిలోని 11 ఏజెన్సీ మండలాల్లో ఈ ఏడాది ఇంటర్ పరీక్షల నిర్వహణకు 16 కేంద్రాలను ఏర్పాటు చేశారు.. ఈ ఏడాది కొత్తగా కొయ్యూరు, ముంచంగిపుట్టు, చింతపల్లి జికె వీధి, అనంతగిరి, ఎగువ సీలేరుల్లో కొత్తగ ఆరు పరీక్ష కేంద్రాలను మంజూరు చేశారు. గతంలో ఉన్న పది కేంద్రాలను కలుపుకుంటే పరీక్ష కేంద్రాల సంఖ్య 16కు చేరింది.

జిల్లా కేంద్రం పాడేరులో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండు, ఎపిటిడబ్ల్యూఆర్ జూనియర్ కళాశాలలో ఒకటి, అరకు వ్యాలీలో ఎపిటిడబ్ల్యూఆర్ జూనియర్ కళాశాలలో రెండు , ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒకటి కేంద్రాలను ఏర్పాటు చేయగా, జి.మాడుగుల ప్రభుత్వ జూనియర్ కళాశాల, పెదబయలు ఎపిటిడబ్ల్యూఆర్ జూనియర్ కళాశాల, హుకుంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల, చింతపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒకటి చొప్పున పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు.


విద్యార్థులు కూర్చొనేందుకు సమకూరుస్తున్న బెంచీలు

మౌలిక సౌకర్యాలు కల్పించాలి : ఎస్ఎఫ్ఐ

పాడేరు : ఇంటర్ పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు మౌలిక సౌకర్యాల ఏర్పాటుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ అల్లూరి జిల్లా ఉపాధ్యక్షులు పి.చిన్నారావు అధికారులను కోరారు. ఈనెల 15 నుంచి జరుగుతున్న ఇంటర్ పరీక్షలకు ఏజెన్సీలోని అన్ని కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, వైద్యసదుపాయం ఇతర సౌకర్యాలను కల్పించాలని, మాస్ కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా అధికారులు పటిష్టనిఘా పెట్టాలని కోరారు. అలాగే పరీక్ష కేంద్రాలకు వెళ్లే విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా బస్ సౌకర్యం కల్పించాలని కోరారు. పరీక్ష కేంద్రాల్లో సౌకర్యాల కల్పనలో నిర్లక్ష్యం చేసి విద్యార్థుల జీవితాలతో ఆడుకోవద్దని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు పి. వరహాలు, బి.నరేష్ పాల్గొన్నారు.

మండలి ఎన్నికల్లో గెలుపుపై ఎవరి ధీమా వారిదే!

పిడిఎఫ్ విజయంపైనే అందరి అంచనా...

మొదటి, రెండు ప్రాధాన్యత ఓట్లలో మెజారిటీ ఖాయమంటున్న విశ్లేషకులు





ప్రజాశక్తి -పాడేరు : ఉత్తరాంధ్ర పట్టభద్రుల మండలి ఎన్నికల పోలింగ్ ముగిసింది. ఈ ఎన్నికల్లో 37 మంది అభ్యర్థులు పోటీ చేసినా, ముఖ్యంగా పిడిఎఫ్, టిడిపి, వైసిపి, బిజెపి అభ్యర్థుల మధ్యే ప్రధాన పోటీ కనిపిస్తోంది. ఇక పాడేరు ఏజెన్సీలోనూ ఈ నలుగురు అభ్యర్థుల ప్రచారమే జోరుగా సాగింది. అధికార వైసిపి శ్రేణులు అన్ని మండలాల్లో విస్తృత స్థాయిలో భారీ ప్రచారమే చేపట్టారు. ఆ పార్టీ ప్రజాప్రతినిధులు, నేతలతోపాటు వాలంటీర్లు, గృహసారథులు, కన్వీనర్లు అధికార పార్టీ కోసం చెమటోడ్చి ప్రచారం నిర్వహించారనే చెప్పాలి. ఇక నిరుద్యోగులతోపాటు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ప్రైవేట్ ఉద్యోగులు, అధికశాతం పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ వైపే మొగ్గు చూపించారు. ప్రభుత్వ వ్యతిరేక వర్గాల వారు కూడా పిడిఎఫ్, టిడిపి, అభ్యర్థుల వైపు మొగ్గు చూపించారు. ప్రధాన ప్రత్యర్థులుగా పోటీలో నిలిచిన పిడిఎఫ్, వైసిపి, టిడిపిలకు చెందిన అభ్యర్థుల విజయవకాశాలపైనే ఇప్పుడు సర్వత్రా జోరుగా ఊహాగానాలు సాగుతున్నాయి. గెలుపుపై ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తున్నారు.

అల్లూరి జిల్లాకు సంబంధించి పాడేరు డివిజన్లోని 11 మండలాల్లో ఈ మండలి ఎన్నికల పోలింగ్ జరిగింది. 11,525 మంది పట్టభద్రుల ఓటర్లకు గాను, 8,362 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పాడేరు డివిజన్లో పోలింగ్ సరళిని బట్టి పాడేరు ఏజెన్సీలో మొదటి ప్రాధాన్యత ఓట్లు రెండవ ప్రాధాన్యత ఓట్ల ఆధిక్యత పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభకే వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఓటర్ల నుంచి ఎన్నికల విశ్లేషకుల వరకు అభిప్రాయపడుతున్నారు.

ఇక. మొదటి ప్రాధాన్యత ఓటును టిడిపి, బిజెపి, వైసిపిలకు వేసిన ఓటర్లు తమ రెండవ ఓటును పిడిఎఫ్ అభ్యర్థికి వేసినట్లుగా భావిస్తున్నారు. దీంతో రెండవ ప్రాధాన్యత ఓట్లులోనూ రమాప్రభకే ఆధిక్యత వస్తుందని అంచనా వేస్తున్నారు. మండలి ఎన్నికల్లో పాడేరు ఏజెన్సీ ఓటర్లు మొదటి నుంచి పిడిఎఫ్ అభ్యర్థులకు ప్రాధాన్యతను ఇస్తున్నారు గతంలో కూడా మెజారిటీ ఇచ్చారు. ప్రస్తుతం ఈ ఎన్నికల్లో కూడా పిడిఎఫ్ గెలుపు కోసం ప్రజా సంఘాలు స్వచ్ఛందంగా పనిచేశాయి. ఉద్యోగ ఉపాధ్యాయ వర్గాలు ప్రైవేట్ ఉద్యోగులు పట్టభద్రులు మొగ్గు చూపడంతో పిడిఎఫ్ కు మరోసారి మెజార్టీ ఖాయమని భావిస్తున్నారు.

గడువులోగా సమగ్ర భూ రీసర్వే పూర్తి

- కలెక్టర్ సుమిత్‌కుమార్



ప్రజాశక్తి -పాడేరు : సమగ్ర భూసర్వేను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి సబ్ కలెక్టర్లు, ఐటిడిఎ ప్రాజెక్టు అధికారులు, తహశీల్దారులతో భూముల రీసర్వేపై జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. సర్వే పురోగతిపై మండలాల వారీగా సమీక్షించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్వేపై రెవెన్యూ అధికారులు శ్రద్ధ పెట్టాలన్నారు. భూవివాదాలు లేకుండా మ్యుటేషన్ల ప్రక్రియవేగంగా పూర్తి చేయాలని సూచించారు. డిపిఎస్ సర్వే బృందాలతో మాట్లాడి సర్వే పనులు త్వరతగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. మూడు నెలలుగా సమగ్ర భూరీసర్వే జరుగుతున్న నేపథ్యంలో ఇప్పటికే దీనిపై విఆర్ఒలకు పూర్తి అవగాహన వచ్చి ఉండాలన్నారు. అవసరమైతే మరొకసారి శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు.

జూమ్ కాన్ఫరెన్స్‌లో పాడేరు, రంపచోడవరం ఐటిడిఎ పిఒలు రోణంకి గోపాలకృష్ణ, సూరజ్‌గనోరే, పాడేరు సబ్ కలెక్టర్ వి.అభిషేక్, అసిస్టెంట్ కలెక్టరు శ్రీవాత్సవ, సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ మోహనరావు, తహశీల్దార్లు, సర్వేయర్లు పాల్గొన్నారు.

ఎన్నికల విధులకు గైర్హాజరైన కార్యదర్శిపై కలెక్టర్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి -హుకుంపేట : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల విధులకు గైర్హాజరైన హుకుంపేట మండల కేంద్ర కార్యదర్శి కె.త్రినాథ్‌పై మంగళవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు స్థానిక తహశీల్దార్ రాజ్యలక్ష్మి, ఎంపిడిఒ వెంకటరావు వెల్లడించారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ 13న మండల కేంద్రంలోని ఎన్నికల పోలింగ్ కేంద్రంలో బాధ్యతల నిర్వహించాల్సిన కార్యదర్శి విధులకు గైర్హాజరవ్వడమే కాకుండా, ఎంపిడిఒ ఫోను చేసినా స్పందించలేదన్నారు. పోలింగ్ కేంద్రంలో తాగునీరు, పారిశుధ్యపనులు ఇతర బాధ్యతలను పర్యవేక్షించాల్సిన కార్యదర్శి, విధుల పట్ల నిర్లక్ష్యం వహించినట్లు భావించి, దీనిపై కలెక్టర్ సుమిత్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. మండల కేంద్రంలో విధులు నిర్వహించే సెక్రటరీ రెండు పోలింగ్ కేంద్రాలకు రాకపోవటంతో పలు ఇబ్బందులు పడ్డామనిపేర్కొన్నారు.


మాట్లాడుతున్న ఐటిడిఎ ఎపిఒ శ్రీనివాసరావు

విపత్తులపై ప్రత్యేక దృష్టి

ఐటిడిఎ ఎపిఒ శ్రీనివాసరావు

ప్రజాశక్తి - రంపచోడవరం

రంపచోడవరం నియోజకవర్గ పరిధిలోని 11 మండలాలలో విపత్తుల సంభవించినప్పుడు వెంటనే తగు చర్యలు తీసుకునే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి పెట్టినట్లు రంపచోడవరం ఐటిడిఎ అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారి జనరల్ సిహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం స్థానిక యూత్ ట్రైనింగ్ సెంటర్ సమావేశ మందిరంలో 11 మండలాలకు సంబంధించిన వందమంది వాలంటీర్లతో విపత్తుల సమయంలో సహాయక చర్యలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విపత్తులు సంభవించినప్పుడు వెంటనే తగు చర్యలు తీసుకోవడానికి ఒక్కొక్క పంచాయితీ నుండి ఒక్కొక్కరిని ఎంపిక చేసి మొత్తం 100 మంది వాలంటీర్లకు ఈ నెల 14 నుండి 25వ తేదీ వరకు 12 రోజుల పాటు 15 శాఖలకు సంబంధించిన అధికారులతో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

రంపచోడవరం మండల అధ్యక్షురాలు బంధం శ్రీదేవి మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారిని కాపాడేందుకు ఇది ఒక గొప్ప అవకాశమని తెలిపారు. ఏజెన్సీలోని వయస్సుతో సంబంధం లేకుండా అనేకమంది వ్యాధుల పట్ల అవగాహన లేక చనిపోతున్నారని, వారికి అందించాల్సిన సేవలు గురించి తెలుసుకొని అవగాహన కల్పించాలని కోరారు. జెడ్పిటిసి సభ్యురాలు పంద వెంకటలక్ష్మి, రంపచోడవరం సర్పంచ్ ఎం.బొజ్జయ్య మాట్లాడుతూ ఏజెన్సీలో వర్షాకాలంలో ఉరుములు మెరుపులు వచ్చినప్పుడు చెట్ల కింద ఉండరాదన్న విషయంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. డివిజనల్ అభివృద్ధి అధికారి కె.కోటేశ్వరరావు మాట్లాడుతూ విపత్తుల సమయంలో ఎక్కడ ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా తగు చర్యలు తీసుకునే విధంగా ఈ శిక్షణ ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. డివిజనల్ పంచాయతీ అధికారి శ్రీనివాసరావు, విపత్తుల కోర్సు శిక్షణ డైరెక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో ఐదు వేల మందికి విపత్తుల ఎదుర్కొనే విధంగా ఆపద మిత్రులకు శిక్షణ ఇవ్వడం జరిగిందని చెప్పారు. ఈ ఆపదమిత్ర శిక్షణ పొందుతున్న వారికి ఎనిమిది లక్షలు వరకు ఇన్సూరెన్స్ చేయించడం జరుగుతుందని, ఐడెంటీ కార్డులు, విపత్తుల ఎదుర్కొనే విధంగా కిట్లు ఇస్తామని తెలిపారు. రంపచోడవరం ఎంపీడీవో ఎంవిఆర్ కుమార్ బాబు, ఇఓపిఆర్‌డి జాన్ విల్టన్, ఈపీఎం కిరణ్మై పాల్గొన్నారు

నూకాలమ్మ పండగకు ఏర్పాట్లు

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం సీలేరు జల విద్యుత్ కేంద్రం సమీపంలో వెలసిన నూకాలమ్మ అమ్మవారి పండగను వైభవంగా నిర్వహించడానికి ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేస్తుంది. ఈనెల 19వ తేదీన సాయంత్రం అమ్మవారి సన్నిధిలో గరగా అలంకరణ చేసి పురవీధుల్లో అమ్మవారి ఊరేగింపు జరుగుతుంది. 20న కుంకుమార్చన పూజలు నిర్వహిస్తారు. 21న కొత్త అమావాస్య సందర్భంగా నూకాలమ్మ ఆలయంలో ప్రధాన పండగ జరుగుతుంది. అదే రోజు 12 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో భారీ అన్నదాన కార్యక్రమాన్ని భక్తుల ఆర్థిక సహాయంతో కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు. 22న భక్తుల గోత్రనామాలతో నిత్య పూజలు నిర్వహిస్తారు. 23న మారు పూజ నిర్వహిస్తారు. భక్తులకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం సీలేరులో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ఈనెల 15 నుంచి నిర్వహించడానికి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ ఎ.సాయిరాం వెల్లడించారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రతి రోజూ ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తామని, పరీక్ష కేంద్రానికి అరగంట ముందే విద్యార్థులు హాల్ టికెట్‌తో హాజరు కావాలని సూచించారు. సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులకు సంబంధించి ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థులు 48 మంది, సెకెండ్ ఇయర్ విద్యార్థులు 24 మంది పరీక్షలకు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ముందు చర్యలు చేపట్టామని, ఈనెల 15 నుంచి ఇంటర్ పరీక్షలు ముగుసే వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని చెప్పారు. పరీక్ష కేంద్రం పరిసరాల్లో ఎవరు సంచరించరాదని స్పష్టం చేశారు.



సీలేరులోని ఇంటర్ పరీక్షా కేంద్రం ఇదే...

ఆపన్న హస్తం అందించరూ..

- చిన్నతనంలోనే మెదడు సంబంధిత వ్యాధికి రెండు ఆపరేషన్లు
- ఆపై ఫిట్స్, అరుదైన చర్మ వ్యాధితో బాధపడుతున్న బాలుడు
- ఇప్పటికే పలు ఆసుపత్రుల్లో వైద్యం
- ఆర్థిక సాయం అందించాలని తల్లిదండ్రుల వేడుకోలు

ప్రజాశక్తి-విఆర్.పురం

పదేళ్ల వయస్సు లోపే మెదడు సంబంధిత వ్యాధికి రెండు ఆపరేషన్లు. ఆపై ఫిట్స్ వచ్చింది. ఇలా ఉండగానే అరుదైన చర్మవ్యాధికి గురయ్యాడు. ప్రస్తుతం బోనకల్ మేఘశ్రీ ఆసుతపత్రిలో చికిత్స పొందుతున్న ప్రసస్థ రత్నం అనే బాలుడికి వైద్యం అందించేందుకు తల్లిదండ్రులు ఆర్థిక సాయం కోసం ఎదురు చూస్తున్నారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి...


ప్రసస్థ రత్నం (చర్మవ్యాధి రాకముందు)


ప్రసస్థ రత్నంకు చర్మం ఊడిపోయి రక్తం కారుతున్న దృశ్యం

అల్లూరి సీతారామరాజు జిల్లా విఆర్.పురం మండలం రేఖపల్లి గ్రామానికి చెందిన యు.కరుణాకర్ అటవీశాఖలో చిరు ఉద్యోగి. ఆయన కుమరుడు 12 ఏళ్ల ప్రసస్థ రత్నంకు చిన్నతనంలోనే మెదడు సంబంధిత వ్యాధి సోకింది. రెండు సార్లు ఆపరేషన్లు చేశారు. అప్పటి నుంచి ప్రతి రోజూ మందులు వాడుతున్నారు. పదేళ్ల లోపే రెండు సార్లు మెదడు సంబంధిత ఆపరేషన్లు జరగడంతో ఫిట్స్ వచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న పలు ఆసుపత్రుల్లో వైద్యం చేయించినా ఫలితం లేకపోయింది. తమిళనాడులోని రాయవెల్లూరు ఆసుపత్రిలో కూడా వైద్యం చేయించారు. ఫిట్స్‌తో ఇబ్బందులు పడుతుండగానే అరుదైన చర్మవ్యాధికి గురయ్యాడు. గడిచిన ఐదు నెలల నుంచి తీవ్రమైన జ్వరం, కామెర్లు, దగ్గు, నోటిపూత మొదలయ్యాయి. దురద రావడం, ఆ తర్వాత చర్మం ఊడిపోయి లోపల కండరాలు బయటకు కనిపించడం, నిరంతరం రక్తస్రావం కావడం జరుగుతుంది. ముఖం, ఛాతి, వీపు భాగంలో చర్మం పూర్తిగా ఊడిపోయి బాలుడికి ఏం జరిగుతుందో తెలియక ప్రసస్థ రత్నం తల్లితండ్రులు కన్నీటి పర్యంతమవుతున్నారు. నిరంతరాయంగా మందులు వాడుతుండడంతో "స్టీఫెన్ జాన్సన్ సింఢ్రోమ్" అనే వ్యాధి సోకిందని చర్మ వైద్యులు చెబుతున్నారు. అది కూడా పూర్తిగా ధ్రువీకరించడం లేదు. బాలుడి పరిస్థితి దయనీయంగా ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో పలు ఆసుపత్రుల్లో చేర్చుకోవడానికి కూడా ముందుకు రావడం లేదు. ప్రభుత్వం చొరవ తీసుకుని ప్రసస్థ రత్నానికి వైద్య సాయం అందించాలని ఆ కుటుంబం కోరుతోంది.

ప్రస్తుతం ప్రసస్థ రత్నం బోనకల్‌లోని మేఘశ్రీ ఆసుపత్రిలో వైద్యం పొందుతున్నాడు. రత్నం పరిస్థితి తెలుసుకున్న మేఘశ్రీ ఆసుపత్రి వైద్యులు టి.పవన్ కుమార్ సహృదయంతో వైద్యం అందించేందుకు ముందుకొచ్చారు. గత 15 రోజులుగా బోనకల్ మేఘశ్రీ ఆసుపత్రిలో చర్మ సంబంధిత వైద్యాన్ని అందిస్తున్నారు. ఇప్పటికే పలువురు చర్మ వ్యాధి నిపుణులు ప్రసస్థ రత్నాన్ని పరిశీలించి వైద్య సూచనలు అందించారు. అరుదైన వ్యాధితో బాధపడుతున్న బాలుడికి వైద్యం అందించడం చాలా ఖరీదుతో కూడుకున్నది. ఇప్పటికే ఆ కుటుంబం బాలుని వైద్యానికి పెద్ద మొత్తంలో ఖర్చు చేసి అప్పుల పాలైంది. ప్రభుత్వం, దాతలు ముందుకొచ్చి తమ కుమారుడి వైద్యానికి ఆర్థిక సాయం అందించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. ఆర్థిక సాయం అందించదల్చుకున్న వారు 9440326777 నెంబర్‌కు ఫోన్‌పే (యు.కరుణాకర్), లేదంటే యు.ప్రసస్థ రత్నం, అకౌంట్ నెంబర్ 41745462362, ఐఎఫ్ఎస్‌సి కోడ్ ఎస్‌బిఐఎన్0020680 బ్యాంకు అకౌంట్‌కు అందించవలసిందిగా కోరుతున్నారు.



మావోయిస్టులు తగలబెట్టి లారీ

వాహనాలను తగలబెట్టిన మావోయిస్టులు

ప్రజాశక్తి-చింతూరు

చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో మంగళవారం మధ్యాహ్నం మావోయిస్టులు మూడు ఇసుక రవాణా వాహనాలను తగలబెట్టారు. జిల్లా అడిషనల్ ఎస్పీ చంద్రకాంత్ తెలిపిన వివరాల ప్రకారం... కొడపాల్ క్యాంపు సమీపంలోని రెండు కిలోమీటర్ల దూరంలో ఇసుక తీసుకు వెళుతున్న మూడు వాహనాలను మావోయిస్టులు అటకాయించి వాటిపై డీజిల్ పోసి తగలబెట్టారు. ఈ ఘటన మేడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మావోయిస్టుల దారి నుండి సిబ్బంది ప్రాణాలను కాపాడుకుని అడవుల్లోకి పరుగులు తీశారు. మావోయిస్టుల చర్యతో పోలీసు బలగాలు అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపడుతున్నాయి.

జనసేన ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-విఆర్.పురం


జనసేన పార్టీ 10వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండలంలోని జీడిగుప్ప గ్రామంలో ఆ పార్టీ జెండాను జనసేన మండల అధ్యక్షులు సాయికృష్ణ ఆవిష్కరించారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జీడిగుప్ప గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో పిల్లలకు స్వీట్లు, కేక్, చాక్లెట్లు పంపిణీ చేశారు. ఆ పాఠశాలలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తరువాత మొద్దులగూడెం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు పండ్లు, పాలు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సాయికృష్ణ మాట్లాడుతూ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ముఖ్యమంత్రిని చేయడమే ప్రధాన లక్ష్యమన్నారు. ఏ పార్టీ అయినా తగ్గితేనే పొత్తులు ఉంటాయని, లేకుంటే ఒంటరిగానే ఎన్నికలకు దిగుతామని చెప్పారు. జనసేన మండల ఉపాధ్యక్షులు కనుగుల శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మండల నాయకులు బాగుల అంజనరావు, చొడే గంగాధర్, గూటాల సమ్మరాజు, పెడపెట్ల పవన్ కళ్యాణ్, మోహన్ రెడ్డి, గూటాల రాము, శివగిరి అనిల్, బొడ్డు శివ శంకర్, మహేష్ గ్రామస్తులు పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న జనసేన పార్టీ నాయకులు

త్రుటిలో తప్పిన ప్రాణాపాయం!

108 అంబులెన్స్ భవనంపై కూలిన చెట్టు

నిర్లక్ష్యంగా చెట్టును కొట్టడం వల్లే ప్రమాదం



108 భవనంపై పడిన చెట్టు

ప్రజాశక్తి-పెదబయలు : స్థానిక మండల పరిషత్ క్వార్టర్స్‌లో ఘోరప్రమాదం త్రుటిలో తప్పింది. నిర్లక్ష్యంగా కొట్టిన చెట్టు పడడంతో 108 వాహన భవనం ధ్వంసం కాగా, ఈ ప్రమాదంలో ప్రాణనష్టం లేకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. వివరాలివి. మండల పరిషత్ క్వార్టర్స్ సముదాయంలోని నీలగిరి చెట్లను వేలం వేయగా, అనుమతి పొందిన వ్యక్తి మంగళవారం చెట్లను కొట్టే కార్యక్రమం చేపట్టారు. చెట్టు నరికేముందు అక్కడ ఉన్న నివాసితులకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా, కనీసం వారికి తెలియపరచకుంటే నిర్లక్ష్యంగా చెట్టు కొట్టడానికి పూనుకోవడంతో అదికాస్తా 108 అంబులెన్సు భవనంపై పడింది. దీంతో ఆ భవనం కాస్తా ధ్వంసంకాగా, అందులోని మందులు, సామగ్రి, సిబ్బంది వంటసామాన్లు, ఇతర వస్తువులకు నష్టం వాటిల్లిందని అంటున్నారు. దీంతో ప్రస్తుతం 108 వాహన సిబ్బంది ఇపుడు ఎక్కడుండాలో అనే సమస్య ఉత్పన్నమైంది. మరోవైపు విధులను ముగించుకుని, ఆ భవనంలో నిద్రిస్తున్న సిబ్బంది, చెట్టు కూలే సమయానికి పొరపాటున బయటకు వచ్చిఉంటే జరగరాని నష్టం వాటిల్లేదని స్థానికులు మండిపడుతున్నారు. ఇదే ఘటనలో కింది వరుసలో ఉన్న మరో ఇంటిపై కొమ్మలు పడడంతో రేకులు విరిగిపోయాయని అంబులెన్స్ పైలెట్ రమణ చెప్పాడు. చెట్లు కొట్టే ముందు అక్కడున్న వారికి సమాచారం ఇవ్వకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించిన వ్యక్తిపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ వెంకట పూర్ణిమ

మోదకొండమ్మ ఉత్సవ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి -హుకుంపేట: . మే నెల 7, 8, 9.తేదీలలో నిర్వహించే మోదకొండమ్మ జాతర ఉత్సవ కమిటీని మంగళవారం ఎన్నుకున్నట్లు హుకుంపేట సర్పంచ్ సమిడా వెంకట పూర్ణిమ తెలిపారు. మంగళవారం స్థానిక మోదకొండమ్మ ఆలయ ప్రాంగణంలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించి, మోదకొండమ్మ ఉత్సవ కమిటీని ప్రకటించారు.. కమిటీ అధ్యక్షులుగా పాంగి అనిల్‌కుమార్, ఉపాధ్యక్షులుగా కొర్ర నాగు, పాడి వెంకటి, ట్రెజరర్‌గా కడిమిశెట్టి దుర్గాప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా గడుతూరి సన్యాసిరావు, సహాయ కార్యదర్శిగా దేవుళ్ళు, కార్యదర్శులుగా కనక, ఆనంద్, భాస్కర్ పండు తదితరులను ఎన్నుకున్నారు. నూతన ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మోదమ్మ జాతరను మండల ప్రజలందరూ సహకరించాలని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి రేగం మత్స్యలింగం, మాజీ జెడ్‌పిటిసి కొర్రా కాసులమ్మ, నైయిని సత్తిబాబు, ఉపాధ్యాయులు నాగభూషణం నాయుడు, వైస్ సర్పంచ్ గోవింద్, చిన్నారావు, అర్జున్, టి.మత్స్యరాజు గ్రామ పెద్దలు కోరుబిల్లి ప్రవీణ్, శంకర్ అర్జున్, శేఖర్, నూకరాజు, జగదీష్ పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణతో ఆరోగ్య పరిరక్షణ

-జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



పాడేరులో డీవార్మింగ్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి -యంత్రాంగం

పాడేరు : నులి పురుగులను నివారించటం ద్వారా పిల్లల ఆరోగ్యానికి రక్షణ కల్పించాలని జిల్లా కలక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. మంగళవారం జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీకృష్ణాపురం ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత పాఠశాలలో విద్యార్థులతో అల్బెండజోల్ మాత్రలను మింగించి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని 22 మండలాల ఫరిధిలో అన్ని అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో ఏడాది నుంచి 19ఏళ్లలోపు వయస్సున్న పిల్లలందరికీ నిర్దేశించిన మోతాదులో మాత్రలనుదగ్గరుండి మింగించాలని ఆదేశించారు. దీనికోసం ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు సేవలు వినియోగించాలని సూచించారు. మంగళవారం మింగించగా, మిగిలిపోయిన పిల్లలకు తిరిగి ఈ నెల 18న మ్యాప్అప్ కార్యక్రమం నిర్వహించి, శాతశాతం డీవార్మింగ్ పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో 22 మండలాల్లోని 62 పిహెచ్‌సిలు, 350 సబ్‌సెంటర్ల పరిధిలో 3,795 వివిధ పాఠశాలలు, ు 19 కస్తూర్బా విద్యాలయాలు, 23 జూనియర్ కళాశాలల్లో 6-19ఏళ్ల వయస్సుగల 2,60,474 మంది విద్యార్థులున్నారని, అలాగే 3,214 అంగన్వాడీ కేంద్రాలలో ఒకటి నుండి ఐదేళ్లలోపు పిల్లలు 47,365 మంది ఉన్నారని డిఎంహెచ్ఒ డాక్టర్ జమాల్ భాషా కలక్టర్‌కు వివరించారు. వీరు కాకుండా బడి బయట 2,368 మంది పిల్లలు ఉన్నారని, వారితో కలుపుకుని మొత్తం 3,07,839 మంది పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకుని, చర్యలు చేపడుతున్నామన్నారు. దీనికోసం 3,952 మంది ఆశ కార్యకర్తలు, 464 మంది ఎఎన్ఎంల సేవలు వినియోస్తున్నామని డిఎంహెచ్ఒ వివరించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది,ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కాగా మంగళవారం 90 శాతంపైగా పిల్లలతో అల్బెండజోల్ మాత్రలు మింగించామని, మిగిలిన వారికి ఈ నెల 18న మ్యాప్అప్‌ద్వారా పూర్తి చేస్తామని డిఎంహెచ్ఒ జమాల్‌భాషా వెల్లడించారు.



గుడివాడ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో పిఒ గోపాలకృష్ణ

దుంబ్రిగూడ: స్థానిక పిహెచ్‌సి పరిధిలోని కస్తూర్బా విద్యాలయంలో బాలికలకు నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీని డిటిసిఒ డాక్టర్ విశ్వేశ్వరనాయుడు ప్రారంభించి, పరిశీలించారు. నులిపురుగులను నివారిస్తే, పిల్లలో పోషకాల గ్రాహ్యత శక్తి పెరుగుతుందని, ప్రతిఒక్కరితోనూ వేయించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎస్ సాంబశివరావు, సిబ్బంది బాబురావు, హెల్త్ అసిస్టెంట్ ఎస్ స్వామి, ఎఎన్ఎం కిరణ్మయి, సిబ్బంది పాల్గొన్నారు.

పాడేరు టౌన్: స్థానిక గుడివాడ కాలనీ అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులతో ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణ ఆల్బెండజోల్ మాత్రలను మింగించి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. అపరిశుభ్రత వల్ల వచ్చి, ఆరోగ్యానికి హనికలిగించే నులిపురుగుల నివారణకు ప్రభుత్వం ఉచితంగా ఇచ్చే మాత్రలను ప్రతిఒక్కరూ వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిడిపిఒ ఝాన్సీలక్ష్మి, అంగన్వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రంపచోడవరం : రంపచోడవరం గిరిజన బాలికల ఉన్నత పాఠశాలలో నులిపురుగుల మాత్రలు పంపిణీ కార్యక్రమాన్ని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే మంగళవారం ప్రారంభించారు.కార్యక్రమంలో ఎడిఎంహెచ్ఓ డాక్టర్ అనూష, డాక్టర్ నరేష్, డివిజనల్ పంచాయతీ అధికారి శ్రీనివాసరావు, ఎంపీడీవో ఎంవిఆర్ కుమార్ బాబు, మలేరియా అధికారి రామకృష్ణ, ఎంపిహెచ్ఓలు పీటర్, సంతోష్ రాజ్, హెచ్‌వి సీతాయ్యమ్మ, ఏఎన్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విఆర్.పురం : స్థానిక కేజీబివి విద్యాలయంలో రేఖపల్లి సర్పంచ్ పూనెం సరోజినీ మంగళవారం నులి పురుగుల నివారణకు మాత్రలు పంపిణీ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ ధనలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్స్, ఏఎన్ఎం, ఆశా వర్కర్, సిబ్బంది పాల్గొన్నారు.



రంపచోడవరం గిరిజన బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నులి పురుగుల మాత్రలు వేస్తున్న ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే

సాంకేతిక సవాళ్లకు యువత సిద్ధం కావాలి : పల్సస్ సిఇఒ శ్రీనుబాబు

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ: సాంకేతిక ప్రగతి, ఆవిష్కరణలు విసిరే సవాళ్లను స్వీకరించడానికి యువత సిద్ధంగా ఉండాలని పల్సస్ సంస్థ సిఇఒ డాక్టర్ జి.శ్రీనుబాబు అన్నారు. మంగళవారం ఏయూ అసెంబ్లీ మందిరంలో నిర్వహించిన ఫార్మశీ కళాశాల 72వ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏయూ ఫార్మశీ కళాశాల విద్యార్థిగా చేరిన నాటి నుంచి నేడు సిఇఒగా ఎదిగిన ప్రస్థానాన్ని విద్యార్థులకు వివరించారు.

ఫార్మశీ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య వై.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, యువతలో ఉద్భవించే నవ్య ఆలోచనలు కార్యరూపంలో చూపాలన్నారు. విశ్రాంత ప్రిన్సిపల్ ఆచార్య కెవి.రమణమూర్తి మాట్లాడుతూ, విద్యార్థుల్లో ఉన్న బహుళ నైపుణ్యాలను ప్రస్ఫుటం చేయడానికి, ఆర్గనైజేషనల్ స్కిల్స్ పెంచడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయుక్తంగా నిలుస్తాయని చెప్పారు. కార్యక్రమంలో విభాగ ఆచార్యులు జి.గిరిజాశంకర్, ఎకెఎం పవార్, కె.ఈశ్వర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మలేరియా, టైఫాయిడ్‌తో ఆసుపత్రిలోనే..

ఆరు నెలల శిశువు మృత్యువాత

- ఎగుబూడి గ్రామంలో విషాదం

- వరుస శిశు మరణాలతో మన్యవాసుల్లో ఆందోళన

ప్రజాశక్తి -అనంతగిరి : అల్లూరి ఏజెన్సీలో అనారోగ్యంతో శిశుమరణాలకు అడ్డుకట్ట లేకుండా పోతోంది. మలేరియా, టైఫాయిడ్‌తో చికిత్స పొందుతూ ఎస్.కోట ఆసుపత్రిలో ఆరునెలల శిశువు మృతి చెందిన ఘటనతో ఎగుబూడి గ్రామంలో విషాదం నెలకొంది. ఏజెన్సీలో వరుస శిశుమరణాలు, అందులోనూ మలేరియాతో శిశువు మృతితో మన్యవాసుల్లో ఆందోళన తీవ్రమౌతోంది. వివరాలివి.

అనంతగిరి పిహెచ్‌సి పరిధిలోని చిలగలగెడ్డ పంచాయతీ ఎగుబూడి గ్రామానికి చెందిన జన్ని. గంగమ్మకు జన్మించిన ఆరునెలల పసికందు మంగళవారం మతి చెందింది. కొన్నాళ్లుగా చిన్నారి ఆరోగ్యం బాగోలేకపోవడంతో విజయనగరం జిల్లా ఎస్.కోట ప్రభుత్వ సిహెచ్‌సికి వైద్యం కోసం రెండు రోజుల క్రితం తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు నిర్వహించిన పరీక్షల్లో మలేరియా, టైఫాయిడ్‌గా నిర్ధారణ అయిందని మృతి చెందిన శిశువు తల్లిదండ్రులు ఆవేదనతో తెలిపారు.ఈ నేపథ్యంలో చికిత్స కొనసాగిస్తుండగా, ఆరోగ్యం విషమించడంతో ఆసుపత్రిలోనే శిశువు మృతి చెందిందని వారు తెలిపారు. మలేరియా, టైఫాయిడ్‌తో శిశువు మరణంతో బాధిత తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతదేహాన్ని గ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించినట్లు వారు తెలిపారు. ఆరునెలల శిశువు మరణంతో ఎగుబూడిలో విషాదం నెలకొంది.

విద్యుత్ అంతరాయంతో హాజరు నమోదుకు అవస్థలు

ప్రజాశక్తి- పెదబయలు : మండలంలోని విద్యుత్ అంతరాయంతో వివిధ శాఖల ఉద్యోగులు, ఉపాధ్యాయులు సాయంత్రం విధులు ముగించిన తర్వాత ఫేస్, ఎపిఎఫ్ఆర్ఎస్ హాజరు నమోదు కాలేదు కాక నానా అవస్థలు పడ్డారు. మండల కేంద్రంలో సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడడంతో బిఎస్ఎన్ఎల్ సిగ్నల్స్ లేకపోవడంతో ఉద్యోగ, ఉపాధ్యాయుల ఫేషియల్ హాజరుకు ఇబ్బందులేర్పడ్డాయి. దీంతో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారంతా విధులు ముగిసిన తర్వాత హాజరు వేయలేకపోవడంతో సకాలంలో ఇళ్లకు చేరుకోలేని పరిస్థితి ఉత్పన్నమైంది.దీంతో వారంతా ఆందోళన, ఆవేదన వ్యక్తం చేశారు.

మద్యం మత్తులో వాహనాలు నడిపితే చర్యలు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: మద్యం మత్తులో వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని పాడేరు ఎస్ఐలు లక్ష్మణరావు, రంజిత్ కుమార్ హెచ్చరించారు. పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా కేంద్రం పాడేరులోని పాడేరు-అరకు ప్రధాన రహదారిలో మంగళవారం విస్తృతంగా వాహనాలు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధరించకుండా, నంబర్ ప్లేట్లు సక్రమంగా లేని, వాహనాలతోపాటు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా మైనర్లు వాహనాలు నడపడం, ట్రిపుల్ రైడింగ్, రాంగ్ రూట్‌లో వెళ్ళటం, ఇతర ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించడం వంటి అతిక్రమణలపై కేసులు,జ రిమానాలను తప్పవని హెచ్చరించారు. డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, వాహన రిజిస్ట్రేషన్ కాగితాలు కలిగి ఉండాలన్నారు. చిన్నపిల్లలకు వాహనాలు ఇవ్వరాదన్నారు. ముఖ్యంగా డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడితే కఠిన చర్యలు తప్పమన్నారు.



పాడేరు - అరకు రహదారిపై వాహన తనిఖీలు చేస్తున్న ఎస్ఐలు



ఆసుపత్రిలో సౌకర్యాలను పరిశీలిస్తున్న అప్పారావు, సీతారాం

పిల్లల హక్కులకు భంగం కలిగిస్తే సహించం

- ఎపి బాలల హక్కుల పరిరక్షణ కమిషన్

- ప్రభుత్వ మానసిక వైద్యశాలలో అరకొర సదుపాయాలపై సీరియస్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పిల్లల హక్కులకు, వారి సంక్షేమానికి భంగం కలిగించే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు, సభ్యులు గొండు సీతారాం అన్నారు. మంగళవారం చినవాల్తేరులోని ప్రభుత్వ మానసిక వైద్యశాలను వారు ఆకస్మికంగా సందర్శించారు. ఆసుపత్రిలో 18 ఏళ్లలోపు బాలలు మానసికంగా ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిశీలించేందుకు చిన్న పిల్లల వార్డుల్లో కలియదిరిగారు. సౌకర్యాలపై ఆరా తీశారు. భోజన వసతులు, శుచీ, శుభ్రతలపై సూపరింటెండెంట్ హరికృష్ణను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఒపి విభాగంలో నమోదైన చిన్న పిల్లలకు సంబంధించిన కేసుల రికార్డులు పరిశీలించారు. అనంతరం అప్పారావు, సీతారాం మాట్లాడుతూ 18 సంవత్సరాలలోపు బాలలకు ప్రత్యేకించి ఒక విభాగం కేటాయించి వారికి మెరుగైన వైద్యం అందించాలన్నారు. వివిధ మానసిక వ్యాధులతో చికిత్స పొందుతున్న వారితో కలిపి ఎట్టి పరిస్థితుల్లోనూ చికిత్స అందించవద్దని ఆదేశాలు జారీ చేశారు. అనుభవిజ్ఞులైన వైద్యుల పరిశీలనలో త్వరితగతిన కోలుకునేలా నిర్విరామ వైద్యం అందేలా చర్యలు చేపట్టాలన్నారు.

రికార్డులేవీ ?

బాలలకు సంబంధించి పూర్తి స్థాయి రికార్డులు నిర్వహించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అందరికీ అందుబాటులో ఫిర్యాదుల పెట్టె ఉండాల్సింది పోయి మారుమూల ప్రాంతంలో అమర్చడంపై ప్రశ్నించారు. వైద్యం పొందుతున్న చిన్నారులు భోజనం, టిఫిన్లలో నాణ్యతా ప్రమాణాలు లేవని, మెనూ ప్రకారం ఆహార పదార్థాలు అందడం లేదని, కాంట్రాక్టర్ అరకొరగా అందిస్తున్నారని తమ దృష్టికి తెచ్చినట్టు వారు తెలిపారు. తక్షణమే కాంట్రాక్టర్‌కు మెమో జారీచేయాలని ఆదేశించినట్టు చెప్పారు. అవసరమైతే కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెట్టేందుకు సంబంధిత ఉన్నతాధికారులకు ఆదేశాలిచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. వారి వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ హరికృష్ణ, సిఎస్ఆర్ఎంఒ హైమావతి, విజయనగరం జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారి అల్లు సత్యనారాయణ ఉన్నారు.

గీతం బిజినెస్ స్కూల్ విద్యార్థుల రక్తదానం

ప్రజాశక్తి-మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ బిజినెస్ ఆధ్వర్యాన మెగా రక్తదాన శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. గీతం బిజినెస్ స్కూల్ డీన్ ప్రొఫెసర్ అమిత్‌భద్ర, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎ.శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై స్వచ్ఛంద రక్తదానం చేసిన విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు సామాజిక సేవా కార్యక్రమాలలో పాల్గొనడం ద్వారా వ్యక్తిత్వ వికాసం సాధ్యపడుతుందన్నారు. ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్న గీతం ఎక్సలెన్స్ మీట్ (జెమ్-2023) యువజనోత్సవంలో భాగంగా చేపడుతున్న ముందస్తు కార్యక్రమాలను సామాజిక సేవతో ముడిపెట్టడం పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు. మంగళవారం జరిగిన రక్తదాన శిబిరానికి జెమ్-2023 సిఇఒ డాక్టర్ షంషుద్దీన్ షేక్ సంధానకర్తగా వ్యవహరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ వరప్రసాద్, ప్రొఫెసర్ మంజశ్రీనాయుడు, మేనేజ్‌మెంట్ విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొని రక్తదానం చేశారు. ఎన్‌టిఆర్ రక్త నిధి అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

జి-20 సదస్సుకు 40 దేశాల ప్రతినిధుల రాక

విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున



టీ షర్టును ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మల్లికార్జున తదితరులు


ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖలో ప్రతిష్టాత్మక జి-20 సదస్సును ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకూ నిర్వహించబోతున్నట్టు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. మంగళవారం సాయంత్రం ఎయు కన్వెషన్ హాల్‌లో పోలీసు కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్, జివిఎంసి కమిషనర్ పి.రాజాబాబులతో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. జి-20 సదస్సుకు సంబంధించిన వివరాలను కలెక్టర్ వెల్లడించారు. ఈ నెల 27వ తేదీ నుంచి వివిద దేశాలకు చెందిన డెలిగేట్స్ విశాఖ చేరుకుంటారని తెలిపారు. సుమారు 40 దేశాలకు చెందిన ప్రతినిధులు జి-20 సదస్సులో పాల్గొంటారని అన్నారు. విశాఖ విమానాశ్రయంలో విదేశాల నుంచి వచ్చే ప్రతినిధులకు మన సాంప్రదాయాల ప్రకారం స్వాగత ఏర్పాట్లు ఉంటాయన్నారు. 28వ తేదీన ప్రతినిధుల ప్యానల్ చర్చలు ఉంటాయని, అదే రోజు రాత్రి అతిథులకు గాలా డిన్నర్ ఏర్పాటు చేశామని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి అందులో పాల్గొంటారని చెప్పారు. 29వ తేదీ ఉదయం యోగా, మెడిటేషన్ కార్యక్రమాలు ఉంటాయని, అనంతరం ప్యానల్ చర్చలు జరుగుతాయని అన్నారు. 30న ప్యానల్ చర్చలు అనంతరం విశాఖ మున్సిపల్ కమిషనర్ ఎంపిక చేసిన మూడు ప్రాంతాలను విదేశీ ప్రతినిధులకు చూపిస్తామని తెలిపారు. 31వ తేదీ ఉదయం సిటీ ప్లానర్స్, మున్సిపల్ కమిషనర్స్, ఇతర ఉన్నత అధికారులతో వర్క్‌షాప్ ఉంటుందన్నారు. అదే విధంగా ఈ నెల 18 నుంచి 26వ తేదీ వరకు 'జన్ భాగీదారీ' కింద వివిధ కార్యక్రమాలను జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసిందన్నారు. ఆ రోజు ఉదయం సిటీలో యోగా డ్రైవ్ ఉంటుందన్నారు. 19వ తేదీన ఆర్‌కె.బీచ్ నుంచి 3, 5, 10కె మారథాన్లు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఇందుకోసం ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చునన్నారు. 22న మాక్ జి-20 సదస్సు నిర్వహణ, 24న జివిఎంసి ఆధ్వర్యాన సాగర తీర స్వచ్ఛతా కార్యక్రమం, 25న ప్రీ ఆర్ట్ కాంటెస్ట్, 26న వైజాగ్ కార్నివాల్ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామన్నారు.

పోలీసు కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ మాట్లాడుతూ జి-20 సదస్సు ప్రశాంతమైన వాతావరణంలో జరిగేందుకు 2350 మంది పోలీసు సిబ్బందిని వినియోగిస్తున్నామన్నారు. డెలిగేట్స్ విమానాశ్రయం చేరిన దగ్గర నుంచి వారికి ఏర్పాటు చేసిన వసతి, వారు సందర్శించే ప్రాంతాలలో పటిష్ట బందోబస్తు ఉంటుందన్నారు. అదే సమయంలో సామాన్య ప్రజలకు ఎటువంటి ఇబ్బందులూ కలగకుండా ట్రాఫిక్ తదితర అంశాలపై దృష్టి సారిస్తామన్నారు. జివిఎంసి కమిషనర్ పి.రాజాబాబు మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి 31వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నగరంలో జరుగుతున్నందున ఈ నెల 22 నాటికి నగర సుందరీకరణ పనులు పూర్తి చేస్తామన్నారు. అందుకోసం సుమారు రూ.100 కోట్లు ఖర్చు చేయనున్నట్టు తెలిపారు. అనంతరం జి-20 సదస్సుకు సంబంధించిన టీ షర్టులను ఆవిష్కరించారు.

పెరగనున్న విద్యుత్ వినియోగం

అధికమవుతున్న ఎసిల వాడకం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి



ఉష్ణోగ్రతలు అధికమవుతున్నాయి. ఉక్కబోత ఆరంభమైంది. కనెక్షన్ల మోతాదుకంటే విద్యుత్ వినియోగం ఎక్కువగా వుంది. రానున్న రోజుల్లో ఇది మరింత పెరగనుంది. ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎపిఇపిడిసిఎల్) ఉమ్మడి విశాఖపట్నం ఆపరేషన్ సర్కిల్‌లో ఈ ఏడాది జనవరి 23 నాటికి ఎల్‌టి కేటగిరీలో 17,20,992 కనెక్షన్లు, హెచ్‌టి కేటగిరీలో 1724 కనెక్షన్లు ఉన్నాయి. ఉష్ణోగ్రతలు పెరగడంతో ఎసిల వాడకం పెరిగింది. దీనివల్ల సాధారణ రోజుల కంటే ఫిబ్రవరి నుంచి విద్యుత్ వినియోగం ఎక్కువ నమోదవుతూ వస్తోంది. గత ఐదేళ్ల కంటే ఈ ఏడాది ఆ వినియోగం పెరగనుందని విద్యుత్ శాఖాధికారులు అంచనా వేస్తున్నారు. రాబోయే వేసవిలో ఉష్ణోగ్రతలను దృష్టిలో పెట్టుకొని విద్యుత్ సరఫరాకు ఆటంకం లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు తగినట్లు కోతల్లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో 2259 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగంకాగా, ఈ ఆర్థిక సంవత్సరంలో జనవరి 23 నాటికి 2259 మిలియన్ యూనిట్లు వినియోగం నమోదైంది. ఈ నెల చివరికి ఈ వినియోగం అత్యధికంగా వుంటుందని అధికారులు చెబుతున్నారు.

ఎల్‌టి కేటగిరీలో కనెక్షన్ల పెరుగుదల 76.61 శాతంకాగా వినియోగం 84.42 శాతం వుంది. హెచ్‌టి కేటగిరిలో కనెక్షన్ల పెరుగుదల 76.61 శాతంవుండగా, వినియోగం 78 శాతం వుంది. గతం కంటే ఎసిల వినియోగం పెరగడం, దీనికితోడు ఎసిలు ఎక్కువ సమయం ఉపయోగించడంతో ఎల్‌టి కేటగిరీలో విద్యుత్ వినియోగం పెరుగుతూ వస్తోంది. 2017-18లో ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ఎల్‌టి కేటగిరీలో 13,18,501 విద్యుత్ కనెక్షన్లుండగా, 2022-23 జనవరి 23 నాటికి 17,20,992కు పెరిగాయి. ఈ కాలానికి విద్యుత్ వినియోగం 1907.79 మిలియన్ యూనిట్ల నుంచి 2259.98 మిలియన్ యూనిట్లకు పెరిగింది. ఈ నెలాఖరుకు మరో ఐదు వందల మిలియన్ యూనిట్లకు పైగా వినియోగం పెరుగుతుందని విద్యుత్ శాఖాధికారులు చెబుతున్నారు.



సాయం అందజేస్తున్న టిడిపి నేతలు

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి సాయం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని బడదనాంపల్లి పంచాయతీ అమ్మిరేకుల కొత్తవీధి గ్రామంలో ఆదివారం జరిగిన అగ్నిప్రమాదంలో తాటాకు ఇల్లు దగ్ధమై సర్వం కోల్పోయిన ఆ గ్రామానికి చెందిన బోనం కామరాజు కుటుంబానికి టిడిపి ఆర్థిక సాయం అందించింది. టిడిపి మండల అధ్యక్షులు, లబ్బర్తి ఎంపిటిసి గొల్లపూడి పెద్దిరాజు, ఆ పార్టీ నాయకులు మంగళవారం బాధిత కుటుంబానికి రూ.2వేలు నగదు, 25 కేజీల బియ్యం, కూరగాయలు, నిత్యవసర సరుకులు, చీరలు, బట్టలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ డి చిన్నతల్లి, టిడిపి నాయకులు జె.మధు, రాంబాబు, ఎం శ్రీను, డి శ్రీరాములు, బి సత్యనారాయణ గ్రామస్తులు పాల్గొన్నారు.



వెంకటేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న నర్సింగరావు

వెంకటేశ్వరరావు కుటుంబాన్ని సిహెచ్ఎన్ఆర్ పరామర్శ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖపట్నంలో 1980-90వ దశకంలో సిపిఎం, సిఐటియు ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషించిన జ్యేష్ట వెంకటేశ్వరరావు అలియాస్ జంజీర్‌ను ఆయన సతీమణి వసంత, కుమారుడు రణధీర్‌లను సిపిఎం సీనియర్ నాయకులు సిహెచ్.నర్సింగరావు మంగళవారం సాయంత్రం పరామర్శించారు. జ్యేష్ట వెంకటేశ్వరరావు సతీమణి వసంతకు కొద్ది నెలల క్రితం కేన్సర్ వ్యాధి సోకడంతో వైద్యం పొందుతున్నారు. అలాగే రణధీర్‌కు ఓ ప్రమాదంలో రెండు కళ్ళ నరాలు చిట్లి చూపు దెబ్బతింది. అతనూ ఇంటికే పరిమితమై వైద్యం పొందుతున్నారు. నేవల్ డాక్‌యార్డులో వెంకటేశ్వరరావు ఉద్యోగం చేసిన తొలినాళ్లలో ఆయన కుటుంబం మొత్తం పార్టీ పనుల కోసం సమయం వెచ్చిస్తూ చురుకైన పాత్ర పోషించేదని నర్సింగరావు ఈ సందర్భంగా మననం చేసుకున్నారు. ఎండాడ - రుషికొండ - సాగర్‌నగర్ ప్రాంతమంతా కలిపి పంచాయతీగా ఉన్న 2000వ దశకంలో వెంకటేశ్వరరావు సతీమణి వసంత సిపిఎం నుంచి వార్డు మెంబర్‌గా పోటీచేసి గెలుపొందిన విషయం తెలిసిందే.

అశ్లీల చిత్రాలను నియంత్రించండి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : సోషల్ మీడియా వేదికగా, యువత లక్ష్యంగా ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్ అశ్లీల చిత్రాలకు కేంద్ర బిందువుగా మారిపోయాయని, ఈ క్రమంలో ఆ చిత్రాలను నియంత్రించాలని ఎఐవైఎఫ్ విశాఖ జిల్లా కన్వీనర్ వై.రాంబాబు, కో - కన్వీనర్ కె.అచ్యుతరావు కోరారు. మంగళవారం నీలం రాజశేఖర్‌రెడ్డి భవనంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. అశ్లీల చిత్రాల వల్ల యువత తప్పుదోవపడుతోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించి యువతను ప్రగతి పథంలో నడిపించాలని కోరారు.